క్లుప్తంగా

దేశానికి నిజమైన పండగ



సుంకపూరులో అయోధ్య రామాలయం గురించి వివరిస్తున్న శోభారాణి

కోటవురట్ల : బాలశ్రీరాముని ప్రాణప్రతిష్టతో ఈ రోజే భారతదేశానికి నిజమైన పండగ వచ్చిందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర దుర్గావాహిని సంయోజిక శోభారాణి అన్నారు. సుంకపూరు రామాలయంలో విశ్వహిందూ పరిషత్, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అయోధ్య రామమందిరం చరిత్రను వివరించి భారతీయుల 500 ఏళ్ల కల నెరవేరిందన్నారు. భారతీయులుగా గర్వించదగిన గొప్ప చారిత్రాత్మక రోజుగా అభివర్ణించారు. రామనామస్మరణ అన్నింటా జయాలను అందిస్తుందన్నారు. శ్రీరాముని జీవితం ఉత్తమ జీవన విధానానికి దిక్సూచి అన్నారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ నక్కా సత్యనారాయణ, ఖండ సంయోజక్ శ్రీధరాల శ్రీధర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నోడల్ అధికారి సందర్శన



వాడ్రాపల్లిలో ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీపై ఆరా తీస్తున్న నోడల్ అధికారిణి డాక్టర్ దేవి

మునగపాక : మునగపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆరోగ్యశ్రీ రాష్ట్ర నోడల్ అధికారిణి డాక్టర్ ఎల్.బి.ఎస్.దేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంతవరకు మండల వ్యాప్తంగా ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ ఎంతవరకు వచ్చిందనే విషయాలపై అడిగి తెలుసుకున్నారు. జాతీయ కార్యక్రమాలు శతశాతం పూర్తి చేయాలని, పిల్లల్లో రక్తహీనత లోపం లేకుండా చూడాలని సూచనలు చేశారు. వాడ్రాపల్లిలో వలంటీర్లతో కలిసి ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తీరును పరిశీలించారు. ఆమె వెంట వైద్యాధికారి దుర్గా ప్రవళిక, సీహెచ్‌వో దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు వీఎస్ఎం లక్ష్మి, ఎం.ఉమామహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా రామాలయ నిర్మాణ పనులు



పురోగతిలో ఉన్న రామాలయ నిర్మాణ పనులు

అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల గ్రామంలో నూతన రామాలయ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం స్థానికుల సహకారంతో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామానికి చెందిన నాయకులు కోట్ని శివ ఈ పనుల్ని పర్యవేక్షిస్తున్నారు. ఏడాదిలోగా రామాలయం నిర్మాణ పనుల్ని పూర్తి చేస్తామని ఆయన తెలిపారు .టీటీడీ నుంచి నిధులు మంజూరు అవుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు.

ముగిసిన మేలుకొలుపులు



చూచుకొండలో మేలుకొలుపులు

మునగపాక : చూచుకొండలో మేలుకొలుపుల కార్యక్రమం సోమవారంతో ముగిసింది. గత నెల డిసెంబర్ 16న ధనుర్మాసం సందర్భంగా గ్రామస్తులు మేలుకొలుపులకు శ్రీకారం చుట్టారు. అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం ముగిసే వరకు మేలుకొలు పులు కొనసాగించాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం మేలుకొలుపుల కార్యక్ర మంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడలు

యలమంచిలి : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఒక మంచి అవకాశంగా నిలిచిందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లకు సోమవారం యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో బహుమతులు ప్రదానం చేసి ఆట పరికరాలను అందజేశారు. కబడ్డీ, ఖోఖో క్రీడల్లో తెరువుపల్లి, వాలీబాల్‌లో కొక్కిరాపల్లి, బ్యాడ్మింటన్‌లో ఏఎస్ఆర్ కాలనీ ,క్రికెట్‌లో తెరువుపల్లి ప్రతిభ కనబరిచగా, ఆయా జట్లను అభినందించి 24వ తేదీన జరగనున్న నియోజకవర్గ స్థాయి క్రీడల్లో మంచి ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

అంతా రామమయం, జగమంతా రామమయం అన్న విధంగా పల్లెల్లో జైశ్రీరామ్ నినాదాలు మార్మోగాయి. అయోధ్యలో దాదాపు ఐదు శతాబ్దాల చిరకాల వాంఛ నెరవేరుతున్న వేళ రామభక్తుల్లో ఆనందం వెల్లివిరిసింది. బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలోను పండుగలా జరుపుకొన్నారు. ఊరూరా రామాలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించి మామిడి తోరణాలు కట్టారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు జరిపారు. పలు గ్రామాల్లో భక్తులు శోభాయాత్రలు జరిపారు.

అంతా..రామమయం...



పాయకరావుపేట : ఆలయంలో శ్రీరాముని దర్శించుకుంటున్న భక్తులు



పాయకరావుపేట పట్టణంలో శ్రీరాముని శోభాయాత్ర



నక్కపల్లి : దేవవరం రామాలయంలో భజనలు చేస్తున్న భక్తులు



నక్కపల్లి : వేంపాడులో సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



కోటవురట్ల : పాములవాకలో నూతన వస్త్రాల పంపిణీ చేస్తున్న భక్తులు

- ఊరూరా పండగ వాతావరణం
- రామాలయాల్లో ప్రత్యేక పూజలు
- గ్రామాల్లో శోభాయాత్రలు



ఎస్.రాయవరం : శ్రీరామ నామంతో కొరుప్రోలు చిన్నారులు దీపారాధన చేసిన దృశ్యం



ఎస్.రాయవరం : అడ్డురోడ్డులో శ్రీరాముని ముద్రతో ఉన్న కాషాయి జెండాలు పంపిణీ



తిమ్మరాజుపేటలో శోభాయాత్ర



మునగపాక : శ్రీరామభక్తుల సందడి



మునగపాక : రాముల వారిని దర్శించుకుంటున్న భక్తులు



ఎస్.రాయవరం : కొరుప్రోలు వైఎస్సార్ కాలనీలో ఇంటిముందు రంగులు వేస్తున్న బాలుడు



నక్కపల్లి : పెదబోదిగల్లం ముస్లిం గ్రామంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పాయకరావుపేటలో శ్రీరాముని ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



గంగాదేవిపేటలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



తులసీనగర్‌లో శ్రీరాముని శోభాయాత్రలో మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి



రాంబిల్లిలో భక్తులకు దర్శనమిచ్చిన సీతారాములు

నక్కపల్లి : అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట పురస్కరించుకుని మండలంలోని నక్కపల్లి , వేంపాడు, దేవవరం, కాగిత, ఉద్దండపురం, గొడిచర్ల, చినదొడ్డిగల్లు గ్రామాల్లో భక్తుల సందడి నెలకొంది. దేవవరంలో రామ మందిరంలో భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు. వేంపాడులో వికాస తరంగిణి ప్రతినిధులు చినపేర్రాజు, మణిరాజు, సురేష్‌రాజు ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహాలను కోలాటాలు, తోడపెద్దు సంబరాలతో పల్లకిలో ఊరేగిస్తూ శోభాయాత్ర నిర్వహించారు. కాగితలో రామమందిరంలో పూజ లు జరిగాయి. నక్కపల్లిలో ఉదయం రామాలయంలో సీతారాముల విగ్రహాలకు పూజలు నిర్వహించిన అనంతరం వందలాది మంది భక్తులతో శోభాయాత్ర నిర్వహించారు. ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు వరప్రసాద్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, కొప్పిశెట్టి వెంకటేష్, కోసూరు శ్రీను, సత్యనారాయణ, అల్లాడకొండ, బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు శ్రీపాద ప్రణవ్‌రామ్, రామారావు, సత్యసాయి సేవాసమితి ప్రతినిధులు పాల్గొన్నారు. పెదబోదిగల్లంలో ముస్లిం గ్రామంలో హిందూ ముస్లింల ఐక్యత మరోసారి ఫరిడవిల్లింది. ప్రతిఏటా ఈ గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా సోమవారం ముస్లిం సోదరులు గ్రామంలో ఉన్న రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బషీర్, ఫాతిమున్నీసా, లక్ష్మణరావు, సత్తిబాబు, ఎస్‌విఎస్‌ఆచార్యులు, ఏడుకొండలు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

పాయకరావుపేట: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా స్థానిక దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అంబరాన్నంటాయి. పలు గ్రామాల్లో శ్రీరామ, శ్రీ వేంకటేశ్వర, శ్రీపాండురంగ విగ్రహాలతో శోభయాత్ర నిర్వహించారు. భజన కార్యక్రమాలు, కోలాటాలు నిర్వహించారు. అయోధ్య రాముని, ఆంజనేయ స్వామి కాషాయ జెండాలను, అయోధ్య రాముని చిత్రాలను, స్టిక్కర్లను భక్తులకు పంపిణీ చేశారు. రామాలయాల వద్ద అన్న ప్రసాదం పంపిణీ చేశారు. గ్రామాల్లో భక్తులు చేపట్టే శోభాయాత్రలు, ఉత్సవ విగ్రహ ఊరేగింపుల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని రామనామ సంకీర్తనలు వినిపించారు.

అచ్యుతాపురం : అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ట వేళ అచ్యుతాపురం మండలంలోని రామాలయాలు శ్రీరామ నామస్మరణతో మార్మోగిపోయాయి.మండలంలోని వెదురువాడ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారాముల కల్యాణాన్ని సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమనీయంగా నిర్వహించారు.

ఏ నోట విన్నా జైశ్రీరామ్

కోటవురట్ల: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా రామాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీధుల్లో రామ నామ సంకీర్తన చేశారు. కైలాసపట్నంలో కలశాలతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. మేలుకొలుపు ముగింపు సందర్భంగా కోలాటం, భజన బృందాల గురువులను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వర రావు, పార్టీ నాయకులు డీవీ రావు, మేడిశెట్టి నానాజీ, శ్రీనివాస్ పాల్గొన్నారు. పాములవాక రామాలయంలో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా బాలరాముని ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని వీక్షించారు. ఎస్సీ కాలనీలోని హిందూ కుటుంబాలకు పెట్ల యర్రన్నాయుడు లావణ్య దంపతులు, తుమ్మిడి బ్రదర్స్ చైర్మన్ రామ్‌కుమార్ సహకారంతో నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు గ్రామ పెద్దలు వస్త్రాలను అందజేశారు.

మునగపాక: అయోధ్యలోని రాముల వారి విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా మండలంలో ఉదయం నుంచి గ్రామాల్లోని రామాలయాల వద్ద ప్రత్యేక పూజలు,బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. రామాలయాల వద్ద దీపాలు వెలిగించారు.

యలమంచిలి : పట్టణం,మండలంలో రామాలయాల్లో సీతారాముల విగ్రహాలను రిక్షాల్లో పురవీధుల్లో ఊరేగించారు. పాతవీధి రామాలయం వద్ద అన్నసమారాధన జరిపారు. తులసీనగర్ రామాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి పట్టణంలో జై శ్రీరామ్ నినాదంతో ముందుకు సాగారు. యలమంచిలి కొత్తపేట రామాలయంలో భజన గీతాలు ఆలపించారు. పీఎన్ఆర్‌పేటలో అన్నసమారాధన జరిపారు.

ఎస్.రాయవరం : అయోధ్య రామమందిరంలో శ్రీ బాలరాముని విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని పలు గ్రామాల్లో భజనలు, ఆధ్యాత్మిక ర్యాలీలు నిర్వహించారు. సమరత ఫౌండేషన్ సభ్యులు సూర్యారావు సమక్షంలో అక్షింతలు, శ్రీరాముని ముద్రతో ఉన్న కాషాయి జెండాలు పంపిణీ చేశారు. వాకపాడు గ్రామంలో రామాలయంలో చెట్టు భజన కార్యక్రమం నిర్వహించారు. కొరుప్రోలు శ్రీ సీతారామాలయంలో హరిభజన కాలక్షేపం చేశారు. ఇళ్లపై శ్రీరాముని జెండా ఎగురవేసి, ఇంటివాకిటలో రంగుల ముగ్గులు వేశారు. సాయంత్రం దీపారాధన చేశారు.

రాంబిల్లి: అయోధ్యలో రామమందిరం ప్రారంభం సందర్భంగా రాంబిల్లి రామాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి అయోధ్య లైవ్ కార్యక్రమాన్ని ప్రదర్శించారు. దిమిలిలో శోభాయాత్ర నిర్వహించారు. వందలాది మహిళలు శోభా యాత్రలో పాల్గొన్నారు. సీతారాముల విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. అన్నసమారాధన నిర్వహించారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, వైస్ ఎంపీపీ కొట్టాపు లక్ష్మి వడ్డికాసులు, సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ మురళీకృష్ణ పాల్గొన్నారు. వాడనర్సాపురంలో 12గంటల పాటు నిర్విరామ హరిభజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ధనరాజ్ ఆధ్వర్యంలో మూడు భజన బృందాలు పాల్గొన్నారు.



మునగపాక : బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



పాయకరావుపేట: రామాలయంలో భక్తుల దీపారాధన



అచ్యుతాపురం : వెదురువాడలో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు



యలమంచిలిలో భక్తుల సందడి



దిమిలిలో శోభా యాత్ర

న్యాయ సహాయకుల దరఖాస్తులకు 30 తేదీ వరకు గడువు

యలమంచిలి : మండలంలో న్యాయ సహాయకులుగా పనిచేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు ఎ.సాయికుమారి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా జడ్జి ఉత్తర్వుల మేరకు యలమంచిలి మండల పరిధిలోని ప్రజలకు న్యాయపరమైన సలహాలతో పాటు తగు న్యాయ సహాయం చేయాలనే ఆలోచనతో ఉన్న ఔత్సాహికుల నుంచి పారాలీగల్ వలంటీర్లు (న్యాయ సహాయకులు) గా పనిచేయుటకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులతో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు, ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో, ఇతర సంబంధిత పత్రాలు జతచేసి యలమంచిలి న్యాయసేవ అధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దీనికి కనీస విద్యార్హత పదోతరగతి, వివిధ సేవా సంస్థల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడుతుందని, ఎంపికైన అభ్యర్థులకు ఎటువంటి జీతమూ ఉండదని, ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ తరగతుల అనంతరం 25 నుంచి 50 మందిని పారాలీగల్ వలంటీర్లుగా ఒక ఏడాది కాలానికి నియమిస్తారని తెలిపారు. న్యాయ సేవల రోజులకు మాత్రమే గౌరవ వేతనం రూ.250 ఇవ్వబడుతుందని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు జాబితాలు

మునగపాక : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు జాబితాల ప్రదర్శనను అందుబాటులోకి తీసుకువచ్చారు. సోమవారం ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌వోలు అర్హుల జాబితాలను ప్రదర్శన చేశారు. ఓటర్లు తమ పేర్లను జాబితాలో పరిశీలించుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ఎస్.రాయవరం : గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద తుది ఓటరు జాబితా సోమవారం అందుబాటులో ఉంచినట్టు తహసీల్దార్ కె.విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక బీఎల్‌వోలు ద్వారా ఓటరు జాబితా బూత్‌ల వారీగా వేరు చేసి వివరాలు అందుబాటులో ఉంచామన్నారు. మండలంలో 60,687 ఓటర్లతో తుదిజాబితా రూపొందించినట్టు తెలిపారు. ఇందులో పురుషులు 29,334, మహిళలు 31,351 , ట్రాంజెంట్‌లు 2 ఓట్లు ఉన్నట్టు చెప్పారు. ఈ జాబితాల్లో వివరాలు ఓటర్లు సరిచూసుకుని తప్పులు ఉంటే చెప్పవచ్చన్నారు. కొరుప్రోలు ఉన్నత పాఠశాల పోలింగ్‌బూత్‌ల వద్ద బీఎల్‌వోలు మహేశ్వరి, చంద్రశేఖర్, స్థానిక వీఆర్వోలు ఓటరు జాబితా వివరాలు అందుబాటులో ఉంచారు.

2,04,073కు చేరిన యలమంచిలి నియోజకవర్గ ఓటర్లు

అచ్యుతాపురం : యలమంచిలి నియోజక వర్గ ఓటర్ల తుది జాబితాలో భాగంగా 2,04,073 మంది ఓటర్లు ఉన్నారని యలమంచిలి నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి మనోరమ తెలిపారు. సోమవారం నియోజక వర్గ స్థాయిలో అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచామని వెల్లడించారు.2 46 పోలింగ్ స్టేషన్ల పరిధిలో పురుషులు99,340 మంది,మహిళలు 1,04,724 మంది, ఇతరులు 9 మంది ఉన్నారని ఆమె తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 27 నాటికి 2,02,732 మంది ఉన్నారని వివరించారు. అప్పటి జాబితాతో పోలిస్తే 12,501 ఓట్లను చేర్చగా,11,160 ఓట్లు తొలగించామని తెలిపారు.994 సర్వీసు ఓట్లు, 3,034 పీడబ్ల్యూడీ ఓట్లు ఉన్నాయని తెలిపారు.

శరవేగంగా కులగణన

రాంబిల్లి: మండలంలో కుల గణన జోరుగా సాగుతుంది. గ్రామాల్లో కుల గణన కార్యక్రమాన్ని మండల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం కుల గణన కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహిస్తోంది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. సర్వే బృందానికి ప్రజలు సహకరించి వారు అడిగిన వివరాలను చెప్పాలని తహసీల్దార్ పి. భాగ్యవతి, ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు కోరారు.

ఆరోగ్యశ్రీతో పేదల ఆరోగ్యానికి భరోసా

మునగపాక : ప్రతి ఒక్కరూ ఆరోగ్య శ్రీ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండ ల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు కోరారు. మునగపాక-1 సచివాలయంలో సోమవారం ఆరోగ్యశ్రీ కార్డులను ఆయన అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25లక్షలకు పెంచారన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు,పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు,ఏఎన్ఎం దేవకి పాల్గొన్నారు.

మునగపాక: ప్రతీ ఒక్కరూ ఆరోగ్య శ్రీ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు బొడ్డేడ బుజ్జి కోరారు. మండలంలోని అరబుపాలెంలో సోమవారం ఆరోగ్యశ్రీ కార్డులను ఆయన అందజేశారు.

నాగవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

మునగపాక : మండలంలోని నాగవరం సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం ద్వారా వైద్యులు సేవలందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా మంత్రి అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు



అమర్‌నాథ్‌కు కేక్ తినిపిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట : రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన కార్యక్రమాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా కార్యాలయం వద్ద అమర్‌నాథ్ జన్మదినాన్ని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంత్రి అమర్‌నాథ్ విజయవాడ వెళ్తూ పాయకరావుపేటలో తన కాన్వాయ్ దిగి, కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆయన జన్మదిన కేక్‌ను కట్ చేశారు. అనంతరం నాయకులు అమర్‌నాథ్‌కు శాలువాలు వేసి, పుష్ప గుచ్ఛాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంచారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, పాయకరావుపేట, నామవరం పీఏసీఎస్‌ల చైర్మన్‌లు దేవవరపు రాజేష్ ఖన్నా, లత, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలికలకు రక్తహీనత పరీక్షలు

మునగపాక : రక్తహీనత లోపం లేకుండా చూసుకోవాలని తిమ్మరాజుపేట ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ కోరారు. తిమ్మరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం బాలికల కోసం ఏర్పాటు చేసిన హిమోగ్లోబిన్ పరీక్షలను ఆయన పరిశీలించారు. ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి సారించగలరన్నారు. రక్తహీనత లేకుండా తగు పోషకాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే మందులను వాడాలన్నారు. బాలికలు ఎప్పటికపుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న వీసం తదితరులు

నక్కపల్లి : మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ సోమవారం ట్యాబులు పంపిణీ చేశారు. పాఠశాల స్థాయి నుంచే సాంకేతిక విజ్ఞానం పెంపొందించుకునేందుకు వీలుగా జగనన్న ప్రభుత్వం విద్యార్థులకు వేలాది రూపాయల విలువైన ట్యాబులను సరఫరా చేస్తోందని వీసం రామకృష్ణ, అన్నారు. ఒకటో తరగతి నుంచే ఇంగ్లిషు మీడియం, డిజిటల్ క్లాసు రూములు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, విద్యాకమిటీ చైర్మన్ కర్రి పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.